ఆలయాల్లో నాగుల పంచమి వేడుకలు

- పోటెత్తిన భక్తులు
- సల్లంగాచూడు నాగమ్మతల్లి అంటూ భక్తుల ప్రత్యేక పూజలు
- పుట్టలో పాలుపోసిన మహిళలు

ఎల్కతుర్తి : శ్రావణమాసం మొదటి శుక్రవారం, నాగుల పంచమి వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. పిల్లాపాలను సల్లగాచూడు నాగమ్మ తల్లి అంటూ పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు ఉదయాన్నే తలంటూ స్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకున్నారు. శివునికి పాలాభిషేకాలు నిర్వహించి అర్చనలు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దీపారధన చేసి నారికేళములు సమర్పించారు. అలాగే ఆలయ సమీపంలో ఉన్న పుట్ట వద్ద భక్తిశ్రద్ధలతో పాలు పోసి అమ్మవారిని వేడుకున్నారు. భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం నాగులపంచమి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు నాగేంద్రస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేసి పిల్లా పాపలను సల్లగచూడు, పాడిపంటలు బాగుండాలని దీవించు అంటూ వేడుకున్నారు.



ఎల్కతుర్తి : ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

శాయంపేటలో..

శాయంపేట : శ్రావణ శుక్రవారం, నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి, శివమార్కండేయస్వామి ఆలయ ప్రాగణంలో నాగమయ్య ఆలయాల వద్ద, తహరాపూర్‌లోని నాగేంద్రస్వామి, పెద్దకోడెపాక గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పుట్టలను పూలతో ప్రత్యేకంగా అలంకరించిన మహిళలు.. ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోసి భక్తిని చాటుకున్నారు. ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్, అనుదీప్‌శర్మ, నాగేంద్రస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్లు సూర్యప్రకాశ్, భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.



దామెర : ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు ఉప్పల్, శనిగరం, మర్రిపల్లిగూడెం, గూడూరు, వంగపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పిల్లాపాపలతో కలిసి నాగుపాము పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి పండ్లు, పూలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లగా చూడాలని నాగదేవతను వేడుకున్నారు.

దామెరలో..

దామెర : నాగుల పంచమి వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఊరుగొండ శ్రీ నాగేంద్రస్వామి ఆలయానికి భక్తులు ఉదయం నుంచే పెద్దెత్తున పోటెత్తారు. మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నైవేద్యాలు, టెంకాయలు సమర్పించారు.



శాయంపేట : నాగమయ్య ఆలయంలో..

అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉదయాన్నే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి మంగళ హారతులతో పుట్టవద్దకు చేరుకున్నారు. అనంతరం పుట్టలో పాలుపోసి భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామిని పూజించారు.



ఆత్మకూరులో..

నడికూడలో..

నడికూడ : నాగుల పంచమిని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు పూజలు నిర్వహించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



శాయంపేట : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన సింధూజ అనారోగ్యంతో బాధడుతుండగా ఆమె తండ్రి సుధాకర్ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశాడు. శుక్రవారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రూ.1లక్ష 50వేల సీఎం సహాయనిధి పత్రాన్ని బాధితురాలి తండ్రి సుధాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం పాల్పంచుకుంటుందని తెలిపారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక చొరవచూపి ఎల్‌ఓసీ మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్కతుర్తి : మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర, చింతలపల్లి, ఇంధిరానగర్, గోపాల్‌పూర్, బావుపేటకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే సూరారంతో పాటు తిమ్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్, గుంటూరుపల్లి ప్రాంతాల్లో సాయంత్రం 3గంటల నుంచి 4.30 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

వేలేరులో త్రీఫేజ్ సరఫరా నిలిపివేత..

వేలేరు : మండలంలోని పీచర, ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి సబ్‌స్టేషన్లల్లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో శనివారం ఫ్రేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అన్ని 11 కేవీ ఫీడర్ త్రీఫేజ్ సరాఫరాను నిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బహుజన స్టూడెంట్ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్



శాయంపేట : బహుజన స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన మంద సురేశ్‌ను ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మంద శశికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంద సురేశ్ మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐలో పది సంవత్సరాలుగా విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ




ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల ముఖ్యనాథస్వామి దేవాలయ సమీపంలో స్వయంభూగా వెలసిన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు ముఖ్యనాథస్వామి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ శివసాని ప్రవీణ్‌రవీంద్ర మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొంకాల వెంకటసత్తమ్మ, మోహన్‌రెడ్డి దంపతుల జ్ఞాపకార్థం వారి రెండో కుమారుడు ఎన్ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు పూర్తి అవగానే ప్రాణప్రతిష్ట మహోత్సవం ఉంటుందని అన్నారు. మాజీ సర్పంచ్‌లు గడ్డం లక్ష్మిరాజేందర్, గై కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీలు పెద్ది శ్రీనివాస్, మేకల విజయ్‌కుమార్, ఆలయ పూజారి సాయికృష్ణ, బుచ్చిరెడ్డి, యాదవరెడ్డి, రాములు, అనిల్, యాదగిరి, రవీందర్‌రెడ్డి, కృష్ణంరాజు, నాగభూషణం, సారయ్య, రాజు, రాజబాబు, రాజేశ్, కొమురయ్య పాల్గొన్నారు.

నివాళి..



వేలేరు : మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన లావుడ్య కిషన్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కిషన్ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు రాజమల్లయ్య, అమర్‌సింగ్, గ్రామశాఖ అధ్యక్షుడు రమేశ్, ప్రశాంత్, సలీం మాలీక్ పాల్గొన్నారు.

తిరుమలలో హరినామ సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక రామదాసు భజన మండలి సభ్యులు శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 17వ సారి అఖండ హరినామ సంకీర్తనలు చేశారు. ఆ భజన మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజు, శాయంపేట మండల ప్రధాన కార్యదర్శి సదానందం, సభ్యులు పాల్గొన్నారు.

దామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

దామెర : మొదటి శ్రావణ శుక్రవారాన్ని పుస్కరించుకుని మండల కేంద్రంలోని దామెశ్వరాలయం (శివాలయంలో) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చన, అభిషేకాలు చేశారు. అదే విధంగా ఆలయంలోని పార్వతి అమ్మవారిని గాజులతో వినూత్నంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ వేద్రమంత్రోచ్ఛరణ నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు లలిత సహస్త్ర పారాయణం పఠించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, అందరూ బాగుండాలని స్వామివారిని వేడుకున్నట్లు భక్తులు తెలిపారు. కాగా భక్తుల రాకతో ఆలయంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎర్ర స్వప్నరెడ్డి వెంకటరమణారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి తోపాటు భక్తులు పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో అమ్మవారు

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



ఎల్కతుర్తి : యూత్ కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హింగె శ్రీకాంత్ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. అనంతరం ప్రయాణికులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీకి అండగా నిలుస్తున్నారని అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబాల జగన్, చైతన్య, నవీన్, శ్రీకాంత్, వినయ్‌గౌడ్, శ్రావణ్‌రెడ్డి, ప్రణీత్‌గౌడ్, వెంకటేశ్, అర్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతాం

- రైతుబంధుకు పంగనామం పెట్టేందుకు కుట్ర
- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు, చేస్తున్న పనులకు పొంతన లేదని రైతు రుణమాఫీతో తేటతెల్లం అయ్యిందని విమర్శించారు. రూ.1లక్ష 50వేల రుణమాఫీ వచ్చిన సంఖ్య తక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేస్తే ఒకే రోజు 50 వేల ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. దీనిని బట్టి ప్రభుత్వ పనితనం ఏంటో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ద్వారా వర్షాకాలం ప్రారంభం ముందే పెట్టుబడి సాయం అందించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకానికి పంగనామం పెట్టేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నోటికి వచ్చిన హామీలు గుప్పించిందని, వాటిని అమలు చేయడం సాధ్యం కావడం లేదని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిందని మౌనంగా ఉన్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని అన్నారు. అనంతరం మైలారం గ్రామానికి చెందిన రంగు శ్రీధర్ తల్లి చెన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి భౌతికకాయానికి పూలమాల వేశారు. మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, సదయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, శివ, రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ (పరకాల) : అంబేద్కర్ కూడలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

హన్మకొండ (పరకాల): విద్యారంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పరకాల అంబేద్కర్ కూడలిలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియేట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయడంతో పాటు పట్టణంలో శిథిలమైన భవనాలు, అరకొర గదులతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని అన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్, మండల నాయకులు ప్రేమ్, సాయితేజ, అరవింద్, శివ, కార్తీక్, తేజ, రిషి, మహేశ్, వినయ్, పవన్, అజయ్ పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి

ఐనవోలు : రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్, నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగా) జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేపట్టి అనంతరం తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. ఫరూక్‌నగర్ కార్యాలయ సిబ్బందిపై అక్కడి డిప్యూటీ తహసీల్దార్ దుర్భాషలాడటం విచారకరం అన్నారు. సదరు డీటీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్వై రాణి, సర్వేయర్ సూరజ్, సీనియర్ అసిస్టెంట్ గోపి, జూనియర్ అసిస్టెంట్‌లు జయశ్రీ, సాంబరాజు, రికార్డ్ అసిస్టెంట్ మోయినొద్దీన్, అసిస్టెంట్ శ్రీనివాస్, అయిలయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ట్రెంగా జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత

హన్మకొండ (పరకాల): పరకాల పట్టణానికి చెందిన ఓ యువకుడి వద్ద పోలీసులు రూ.5వేల విలువచేసే 220 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఎస్సై నరిసింహారావు టీమ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ యుకుకుడు అనుమానస్పదంగా కనిపిస్తూ ఓ డబ్బాను దాచుకునే ప్రయత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద రూ.5వేల విలువచేసే 220 గ్రాముల గంజాయి లభించింది. పరకాల పట్టవారాల వాడకు చెందిన మహ్మద్ నదీమ్‌గా పోలీసులు గుర్తించారు. మటన్ వ్యాపారం చేసే నదీమ్ జల్సాలకు అలవాటు పడి గంజాయికి బానిసైనట్లు తెలిపారు. రైలులో అరకు వెళ్లి కిలో గంజాయి కొనుగోలు చేసి అతడు వినియోగించగా మిగిలిన గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేందుకు వరంగల్‌కు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సామాన్యుల జీవితానలు నాశనం చేసే గంజాయిని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

వేలేరు : మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపినా, సరియైన పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామని అన్నారు. అనతరం వాహనచోధకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాలు ప్రాణాలు తీస్తాయని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లేదా డయల్ 100 ఫోన్ చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మానవ మనుగడకు వృక్షాలు అవసరం

- మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత

హన్మకొండ (పరకాల) : మానవ మనుగడకు వృక్షాలు అవసరమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత అన్నారు. స్వచ్ఛదనం –పచ్చదనం ముగింపు కార్యక్రమంలో భాగంగా పరకాల పట్టణంలో హుజూరాబాద్ రోడ్డులో బిట్స్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు అధికంగా ఉంటేనే స్వచ్ఛమైన గాలి వీస్తుందని, అందరూ ఆరోగ్యంగా జీవించగలమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, సీఐ క్రాంతికుమార్, కౌన్సిలర్లు లావణ్య, జ్యోతి, పూర్ణచారి, సంపత్‌కుమార్, సారయ్య, రాజు, బిట్స్ ప్రిన్సిపాల్ జోసఫ్, మున్సిపల్ ఆర్ఓ రఘు, ఏఈ రంజిత్, ఈఈ రోహిత్‌కుమార్, ఎస్ఎం సతీష్, వార్డు అధికారులు మొగిలి, బుచ్చిరాజం, బిల్ కలెక్టర్‌లు తిరుపతి, కృష్ణంరాజు, ఆర్‌పీ అమరావతి, సుజాత, ఆశ వర్కర్ శైలజ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



హన్మకొండ (పరకాల) : విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత



దామెరలో..



ఎల్కతుర్తిలో..

దామెరలో..

దామెర : స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు మొక్క నాటి నీరు పోశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, కార్యదర్శులు మనోహర్, నరేశ్, రజిత, సందీప్, అన్నపూర్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.మల్లయ్య అన్నారు. మండలంలోని పీచర, మద్దెలగూడెం గ్రామాల్లో వనమహోత్సవం, స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో వివిధ వార్డులను సందర్శించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం పీచర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మొక్కల పెంపకం, ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కోమి, హెచ్ఎం రాజన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : ఈనెల 5నుంచి ప్రారంభమైన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. అలాగే వివిధ గ్రామాల్లోని వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించి శానిటేషన్ నిర్వహించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు నాగేశ్వర్, విజయ్‌కుమార్, వీరేశం, వివిధ శాఖల అధికారులు, ఎంపీఓలు విమల, నాగరాజు, సెరికల్చర్ అధికారి సారంగపాణి, ఏపీఓ అనిత పాల్గొన్నారు.



వేలేరులో..

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

ఐనవోలు : పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సంతోషంగా జీవించేలా చూడాలని దేవున్ని వేడుకున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. శుక్రవారం నందనం, రాంనగర్ గ్రామాల ప్రజలు పెద్దదేవుడి సామూహిక వనభోజనాలకు బయలుదేరగా.. హాజరైన ఎమ్మెల్యే నాగరాజు దేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజనాలకు వచ్చిన గ్రామాల ప్రజలను ఆత్మీయంగా పలకరించి మాట్లాడారు.



వనభోజనాల్లో గ్రామస్తులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు